# మధుర భావన - 1

ప్రేమానురాగాల పారిజాతాలు

పరిమళించాలి నిత్యము మీ జీవిత వనంలో...

ముద్దు మురిపాల మణి మాణిక్యాలు

దివ్వెలుగా నిలవాలి సదా మీ జీవనయానంలో...

చక్కని చేతిరాతతో ఉన్న ఆ వాక్యాల్ని చదివిన అతని మనసులో మెదిలిన ఓ మధురభావన అందమైన దృశ్యంగా రూపుదాల్చి కనులముందు కదిలింది.

పారిజాత వనంలో... పగడాల్నీ, ముత్యాల్నీ కలిపి వెదజల్లినట్లుగా రాలిపడి ఉన్న పూల దారిలో... యువతీ యువకులిరువురు చేయి చేయీ కలిపి తన్మయత్వంతో సాగుతూంటే... వారి తలలపై మొక్కలనుండి ఉండి ఉండీ పారిజాత పూల జల్లు కురుస్తోంది...!

ఒక వేపు పారిజాతపూల పరామర్శా, మరొకవేపు ఇష్టసఖి చేతి స్పర్శా... పులకింతలు రేపగా, అతను, ఆమె చెంపమీద చూపుడు వేలితో తాకి మైమరపుతో ఏదో అన్నాడు.

ఆమె కూడా మనోహరంగా నవ్వుతూ ఏదో జవాబు చెప్పి అతని భుజంపై తలవాల్చింది.

ఒక క్షణం ఇద్దరూ అలాగే నిలబడిపోయారు.

పలకరింపుగా తలమీద రాలిపడిన పూల స్పర్శతో ఉలికిపడి... పారవశ్యం నుండి కొంచెం తేరుకుని... ముందుకు మెల్లగా అడుగులు వేస్తూ కదిలారు.

డైనింగ్ టేబుల్ దగ్గరున్న కుర్చీలో కూర్చుని... చేతిలో ఉన్న గ్రీటింగ్ కార్డ్ వేపు తదేకంగా చూస్తున్న మేనల్లుడిని ముకుందరావు ఆశ్చర్యంగా చూసి, ఆ  పక్కనే ఉన్న మరొక కుర్చీని జరుపుకుని కూర్చున్నారు.

రెండు క్షణాలు గడిచాయి.

తన రాకని, శబ్దం చేస్తూ కుర్చీలాగి కూర్చున్న పైనాన్ని కూడా గమనించనంత పరధ్యానంగా ఉన్న అతనివేపు విస్మయంగా చూస్తూ ''ఎవర్రా ఆ అమ్మాయి...?'' అనడిగారు.

''నాకూ సరిగ్గా తెలియటం లేదు మామయ్యా...'' అన్నాడతను. చూపు మరల్చలేదు, ధ్యాస చేతిలో ఉన్న కార్డుమీదే ఉంది.

మరుక్షణమే పరధ్యానం నుండి బయటపడి ''అమ్మాయి... అమ్మాయంటున్నావేమిటి మామయ్యా...?'' అన్నాడు.

''ఆ వివరం నువ్వు కదురా చెప్పాల్సింది... అంతసేపు ఆ కార్డు పట్టుకుని అంత తదేకంగా చూస్తున్నావంటే... నీకు బాగా ఇష్టమైన అమ్మాయెవరో పంపించిన కార్డు కాబోలనుకుని 'ఎవరూ, ఏమిటీ' అనడిగా...!''

''అదేంలేదు... ఇది నాకు వచ్చిన కార్డు కానే కాదు...''

మధ్యలోనే ఆయన అడ్డం వచ్చి ''మరి...?'' అంటూ ప్రశ్నార్ధకంగా చూశాడు.

''ఈ మధ్య పోస్ట్-మాన్ మారినట్లున్నాడు. ఇంటి నెంబరు ఒకటే చూసి, సెక్టర్ విషయం పట్టించుకోకుండా ఇచ్చేస్తున్నాడు. ఆ మధ్య ఇలాగే జరిగితే, వేరే వాళ్ళు మా పోస్ట్ వాళ్ళింటికి వచ్చిందని చెప్పి, ఇచ్చి వెళ్ళారు. ఇపుడు మనమూ ఈ కార్డ్ పట్టుకుని సరియైన అడ్రసులో ఇవ్వాలి! ఇదీ విషయం! నువ్వేమో నాకెవరో అమ్మాయి పంపిందనుకుంటూ ఆరా మొదలు పెట్టావ్...'' అంటూ చిన్నగా నవ్వాడతను.

''బావుందిరా...'' అంటూ ఆయనా నవ్వి ''ఎవరో ఏమిటో తెలియకుండానే అంత మైమరపుతో చూస్తున్నావా...'' అన్నాడు.

''ఈ అమ్మాయి ఎవరో తన ఫ్రెండు వాళ్ళ వెడ్డింగ్ యానివర్సరీకి శుభాకాంక్షలు తెలుపుతూ గ్రీటింగ్ కార్డు మీద స్వంతంగా ఓ చిన్న కవితలాంటిది రాస్తేనూ... ఆసక్తిగా అనిపించి. మళ్ళీ మళ్ళీ చదివా... అంతే! కాకపోతే... ఆ కవిత చదవగానే... మనసులో ఒక మధురమైన ఆలోచన కలిగి.... అందమైన దృశ్యంలా కళ్ళముందు కనిపించిందన్నది మాత్రం నిజం...!'' చిరునవ్వు చిందిస్తూ చెప్పాడు.

''ఈ రోజుల్లో పోస్ట్ రావటమన్నదే అరుదైన సంగతి! అన్నీ సెల్ ఫోన్ ద్వారానే జరిగిపోతున్నాయి! ఆ పైన ఓ కవిత స్వంతంగా రాసి పంపిందంటే నిజంగా విచిత్రమే...!'' ముకుందరావు అన్నాడు. ''అయినా అమ్మాయే పంపించిందని నీకు ఖచ్చితంగా తెలిసినట్లు చెబుతున్నావ్... పేరు ఏమిటీ...?''

''మీనా అనే అమ్మాయిని అడ్రస్ చేస్తూ రాసింది కాబట్టి, అమ్మాయే అనుకున్నా. రాసిన అమ్మాయి సంతకం లేకుండా, ఆ కవిత క్రింద చిన్న మామిడి పండు బొమ్మ ఉంది. అంటే... పేరు ఏమై ఉండొచ్చా అని ఆలోచిస్తున్నా....!''

టేబుల్ పైన ఉన్న ఆ కార్డును తీసుకుని ఆయనా చూసి ''మామిడిపండుకి సంబంధించిన పేరు అయివుండొచ్చు. మామిడి పండును గుర్తుకు తెచ్చే అమ్మాయిల పేర్లు ఉంటాయా.....!" ఆలోచిస్తున్నట్లుగా అన్నాడు ముకుందరావు.

''ముద్దుపేరు 'పండు' అయివుండొచ్చుగా మామయ్యా. అందుకని ఏదో ఒక పండు బొమ్మ వేయాలనుకుని... మామిడి పండు బొమ్మ వేసి ఉండొచ్చు...!''

''నిజమేననిపిస్తోంది.... ముద్దుపేరు 'పండు' అయివుండొచ్చు. అయినా మనకెవరో తెలియని వాళ్ళ గురించి మనకి ఇంత ఆలోచనెందుకూ... అనవసరం కదూ... నేనింకా నీకు నచ్చిన అమ్మాయేమోననుకుని, పిల్లని వెదికే శ్రమ మీ అమ్మకి లేకుండా చేశావనుకుని సంతోషించాను....!'' అంటూ పెద్దగా నవ్వారు.

''భలేవాడివే మామయ్య...'' అంటూ అతనూ శృతి కలిపాడు.

''ఏంటన్నయ్యా... ఇద్దరూ అంతలా నవ్వుకుంటున్నారూ...?'' అంటూ శ్యామసుందరి వంటగదిలోనుండి వచ్చింది. ''వీడు ఏం జోక్ చెప్పాడేంటీ...?'' అంటూ కుర్చీలాక్కుని తనూ కూర్చుంది.

''ఏం లేదమ్మా... మనవాడు ఎవరో అమ్మాయి గురించి చెబితే, పేరు ఏమై ఉంటుందా అని ఆలోచిస్తున్నాం.... అంతే...!'' అన్నాడాయన.

ఆవిడ కళ్ళు పెద్దవి చేసి అన్నగారి వేపు విచిత్రంగా చూసింది.

‘‘అలా చెబితే అమ్మకేం అర్థం అవుతుంది మామయ్యా...’’ అని వంశీ తల్లితో ‘‘టిఫిన్ తయారు చేయటం అయిపోయినట్లుందిగా, అన్నీ నేను తెచ్చి సర్దుతాలే, నువ్వు కూర్చో అమ్మా...’’ అంటూ వంటగదిలోకి వెళ్ళి గారెలు ఉన్న చిన్న బేసిన్, చట్నీ గిన్నె తెచ్చాడు. మళ్ళీ వెళ్ళి ప్లేటులు తెచ్చి, అన్నీ సర్దుతూంటే, సుందరి ముకుందరావుతో అంది. ‘‘ఏమిటో అన్నయ్యా.... ఈ వేళ పనమ్మాయి రాలేదా, అన్నీ ఒక్కదాన్నే చక్కబెట్టుకోవాల్సి వచ్చింది. అదే వీడుగానీ పెళ్ళి చేసుకుని ఉంటే, ఈ వయసులో కోడలు నాకు తోడుగా, సహాయంగా ఉండేదికదా!’’

చిన్నగా నిట్టూర్చింది కూడా.

‘‘ఊరుకో అమ్మా... మామయ్య ఎదురు చెప్పడుగదాని అబద్ధాలు చెప్పేస్తున్నావ్...!’’ అన్నాడు వంశీ.

ఆవిడ కొడుకు వైపు విచిత్రంగా చూసి ‘‘ఏం మాట్లాడుతున్నావురా... నేనిపుడు ఏం అబద్దాలు చెప్పానూ...?’’ అనడిగింది.

‘‘ఎవరి సాయం లేకుండా ఈ టిఫిన్ నువ్వొక్కదానివే తయారు చేశావా...?’’

‘‘కాదా... మరి ఎవరు సాయం వచ్చారో చెప్పూ...’’ అంటూ ఆవిడ నిలదీసింది.

‘‘ఎవరూ ఒక్కరుగా ఏ పనీ చేయలేమన్నది నిజం అమ్మా. నువ్వు గారెలు చేశావంటే, మినపప్పు పండించిన రైతుల దగ్గర్నుండీ, అవి మనింట్లోకి రావటం వరకూ ఎందరివో సహాయ సహకారాలు ఉన్నాయి. అలాగే పప్పు రుబ్బే గ్రైండర్ తయారీకీ...’’ అని వంశీ చెబుతూండగానే ‘‘బావుందిలే నువ్వు చెప్పేది’’ అంటూ వాళ్ళిద్దరూ నవ్వేసారు.

టిఫిన్ తింటున్న శ్యామసుందరి ‘‘అది సరేగానీ, నువ్వు దామోదరం గారింట్లో ఫంక్షన్ కి మామయ్యతో పాటూ వెళ్తున్నావుగా, లేకపోతే బావుండదు...!’’ అంది కొడుకుతో.

‘‘నువ్వేమో రానంటున్నావు...అక్కడ నాకెవరూ తెలిసిన వాళ్ళుండరు. మామయ్య తన వయసువాళ్ళతో కలిసిపోతాడు. అందుకే నాకిష్టం లేదు అక్కడికి వెళ్ళటం’’ అన్నాడు.

‘‘కొత్త చోటకి వెళ్ళటంలో కొంచెం ఇబ్బంది ఉంటుంది. నిజమే... కానీ అదే కారణంతో వెళ్ళనంటే ఎలా వీలవుతుందీ... వెళ్తేనేకదా, కొందరితో పరిచయాలు కలుగుతాయి ! నీ వయసువాళ్ళు చాలామందే

రావచ్చును. ఇప్పటి నీ స్నేహితులంతా ఒకప్పుడు కొత్తవాళ్ళేగా. పరిచయం పెరిగాక స్నేహితులవుతారు. నువ్వు మొట్టమొదటిగా స్కూలుకి వెళ్ళినప్పుడు... అదీ కొత్త ప్రదేశమేగా, అలా రోజూ వెళ్ళి వస్తూంటే, ఎందరో స్నేహితులు అవలేదా? ఇప్పుడూ అక్కడికి వెళ్ళి వచ్చాక మంచి స్నేహితులు దొరికే అవకాశమూ ఉంటుందికదా... పోనీ లేదనుకో, ఒకటి రెండు రోజులు మంచి కాలక్షేపం మాత్రం జరుగుతుంది....!'' అంది నచ్చ చెప్పే ధోరణిలో.

ముకుందరావు కూడా తలవూపుతూ ఆవిడ మాటల్ని సమర్థించాడు. వంశీ వైపు చూస్తూ అన్నాడు. ''నువ్వేం ఇక మాట్లాడటానికి లేదు. ఫంక్షన్ కి రావాల్సిందే. నేనటు మా ఇంటినుండి ఎల్లుండి బయలుదేరతాను. నువ్విటునుండి వచ్చేయి. మీ అమ్మ వాదనని కాదనటానికి లేదు...మీ అమ్మ మాటలు విన్నాక నాకో విషయం ఇపుడే అర్థమౌతుంది...నీకీ మాటల చమత్కారం మీ అమ్మ దగ్గర్నుండే వచ్చిందని....!'' అంటూ నవ్వాడు.

వంశీ కూడా చిరునవ్వుతో చూసి, తర్వాత ఇక తప్పదుగా అన్నట్లు వాళ్ళిద్దరి వైపూ చూసి ''సరే, అయితే..'' అంటూ నిట్టూర్చాడు.

ముకుందరావు మరి కాసేపు కూర్చుని, తరువాత దామోదరం గారి ఫంక్షన్ కి వంశీ ఎపుడు ఎలా బయలుదేరి రావాలో వివరాలు అన్నీ చెప్పి, తనూ బయలుదేరి వాళ్ళ ఊరికి వెళ్ళిపోయాడు.

* * *

ముకుందరావు ఎక్కడ ఉన్నాడా అని తోటలో అటూ ఇటూ పరికించి చూస్తున్న వంశీ దగ్గరకు ఆయనే నవ్వుతూ వచ్చి పలుకరించాడు.

''ఇపుడే దామోదరం నీ గురించి అడిగాడు. నువ్వు వస్తావని చెప్పాను. మనవాళ్ళు పిల్లలతో చాలామందే వచ్చారు. నీకు పరిచయం చేస్తాను. కాసేపు అక్కడున్న కుర్చీల్లో కూర్చో...'' అంటూ ఎవరో ఒకాయనతో కలిసి వెళ్ళిపోయాడు.

వంశీ అటూ ఇటూ తలతిప్పి అక్కడి ఏర్పాట్లన్నీ గమనించాడు.

ఎన్ని ఎకరాలుంటుందో తెలియదుగానీ ఆ మామిడితోటలో ఏర్పాట్లన్నీ ఘనంగా ఉన్నట్లు గమనించాడు వంశీ. ఒక వైపు రకరకాల పూలతో అలంకరించబడిన స్టేజీ ఉంది. కొంచెం దూరంగా పలురకాల స్వీట్సు, కూల్ డ్రింక్సు ఉన్న స్టాల్స్ కనిపించాయి. అరటిపళ్ళు గెలలు అక్కడక్కడా చెట్లకు వేలాడదీసారు.

పిల్లలు, పెద్దలు భారీ అలంకరణలతో సందడిగా, గుంపులుగా నవ్వులతో కబుర్లు చెప్పుకుంటూ తిరుగుతున్నారు. అందర్నీ ఓ సారి పరిశీలనగా చూసి ఎక్కడైనా స్థిమితంగా  కూర్చుందామా అని చూస్తున్న వంశీ దగ్గరకు ఒక అమ్మాయి హడావుడిగా పరుగులాంటి నడకతో వచ్చింది. ఒక్క సెకను సేపు అతనివైపు పరిశీలనగా చూసి ''మీరు... మీరు... వంశీకృష్ణ... కదూ...?'' అంది.

వంశీ కొంచెం అయోమయంగా చూస్తుంటే... ఆ అమ్మాయి తొందర పడుతున్నట్లు ''తొందరగా చెప్పండీ...'' అంది. మళ్ళీ వెంటనే ''అవును కదూ.....?'' అనడిగింది.

వంశీ 'ఎందుకూ, ఏమిటీ' అని అడుగుదామని ఆలోచనగా చూస్తుంటే, మళ్ళీ అమ్మాయి అలాగే హడావుడిగా 'అబ్బా... ఎందుకలా ఆలోచిస్తున్నారూ ..టైమయిపోతోంది మీరేగా, మీ పేరు అదేగా...'' అంది.

కొంచెం సంశయంగా తలాడించి వంశీ ఇంకా ఏదో అనబోతోంటే, ఆ అమ్మాయి అదేం వినిపించుకోకుండా, అతని చేయి ఎత్తి పట్టుకుని దూరంగా ఉన్న ఓ గుంపువైపు చూపిస్తూ ''నేను గెలిచానూ, కనుక్కున్నా... చూడండీ...'' అంటూ చిన్నగా గెంతింది.

వంశీకిదంతా తమాషాగా అనిపించింది.

ఆ అమ్మాయి వైపు విచిత్రంగా చూస్తూ... ''నా పేరు వంశీ అయితే, మీరు గెలవటం ఏమిటీ, వివరం చెప్పండీ...!'' అన్నాడు.

''అంటే...'' అంటూ ఒక నిముషం ఆగి మళ్ళీ చెప్పింది. ''ఏం లేదండీ... మా ఫ్రెండ్స్ ఒక పోటీ పెట్టారు. ఈ అవరణలోనే ఉన్న ఒక అబ్బాయిని... అదే.. వంశీకృష్ణ అనే పేరు గలవానిని నేను... వాళ్ళిచ్చిన టైము లోపలే కనిపెట్టగలగాలని! ఆ పోటీకి నేను సరేనని... వెతకటం మొదటుపెట్టా. సరిగ్గా టైములోపలే మిమ్మల్ని పట్టేసా... పోటీ లో గెలిచేసా...!''

"అవునూ... మీకు తెలియని కొత్తవాడిని మీరెలా పట్టుకోగలననుకున్నారూ....?'' ఆ అమ్మాయిని ప్రశ్నించాడతను.

''వాళ్ళు కొన్ని క్లూస్ ఇచ్చార్లెండి...!'' అంది నవ్వుమొహంతో, ఓరగా అతనివైపోసారి చూసి.

''ఆ క్లూస్ ఏమిటో కొంచెం నాకూ చెప్పండి. వాటికి నేనెలా సరిపోయానో తెలుసుకోగలుగుతానూ...!'' అడిగాడు అభ్యర్థనగా.

''మనిషి రంగు తెల్లని తెలుపు కాదు, నల్లని నలుపూ కాదు, ఎత్తు ఆరడుగులకి మించకుండానూ, తగ్గకుండానూ ఉంటుంది. చూపుల్లో చురుకుదనం, పెదవులపై చెరగని చిరునవ్వు...'' అని చెబుతూ ఆ అమ్మాయి ఫక్కున నవ్వేసింది.

అతనేదో అనబోతూండగానే ఆ అమ్మాయి మిత్రబృందం అంతా గోలగోలగా అక్కడికి చేరుకున్నారు.

వాళ్ళంతా అతనివైపు ఓ క్షణం విచిత్రంగా చూసారు. ఒకమ్మాయి పెద్దగా అంది. ''మేమందరం నిన్ను ఆటపట్టిద్దామని... అలా ఏదో పేరు చెప్పి కనుక్కోమని అన్నాంగానీ నిజంగా అలాంటి పేరుగలవాళ్ళు ఇక్కడికి వచ్చారనే విషయమే తెలియదూ... సరదాగా ఏవో పోలికలు చెప్పాం, నువ్వు నిజంగానే అలాంటి వ్యక్తిని పట్టుకుని... గెలిచేసావ్... విచిత్రంగా ఉంది!''

మళ్ళీ ఆ అమ్మాయే అతని వైపు ఓ క్షణం పరకాయించి చూసి... " మేం కల్పించిన వివరాలకు సరిగ్గా పేరుతో సహా కుదిరిపోయేట్లుగా మీరెలా ఇక్కడ ప్రత్యక్షం అయ్యారండీ బాబూ...!'' అంటూ సరదాగా నవ్వింది.

వంశీని పట్టుకుని చూపించిన అమ్మాయి నవ్వు మొహంతో ''ఎలా అయితేనేం నేను గెలిచానుకదా, పందెం డబ్బు ఇవ్వండి ముందు...'' అంటూ హుషారుగా అంది.

వాళ్ళు నిష్ఠూరంగా చూస్తూ ''ఇవ్వక చస్తామా....'' అంటూ కొంత మొత్తం అమ్మాయి చేతిలో పెట్టబోతోంటే... వంశీ ఆ డబ్బును అందుకుని లెక్కచూసి, సరిగ్గా సగం ఆ అమ్మాయి చేతిలో పెట్టి ''మీరు పోటీలో పూర్తిగా గెలవలేదు. నాపేరు... మీరనుకున్నట్లుగా వంశీకృష్ణ... కాదు వంశీ మోహన్...'' అని మిగతా డబ్బును ఆ గుంపులోని ఒకమ్మాయి చేతికి అందించాడు.

''అదేమిటీ... మీ పేరు అదేనని నాతో అన్నారు...?'' అంటూ దీర్ఘం తీసిందా అమ్మాయి.

''కొంచెం తేడా అంతేగా, ఆపైన మీరు హడావుడి పెట్టేసరికి... నేను సందిగ్ధంగా తలవూపుతూ ఈ విషయం చెప్పబోతోంటే... మీరు పట్టించుకోలేదు, నా మాట వినిపించుకునే పరిస్థితిలో లేరని అనుకుని సరదాగా చూస్తుండిపోయా. అసలు అలాంటి వ్యక్తి లేకపోయినా మీ ఫ్రెండ్స్ పందెం కట్టారు. అయినా చూడండి. నేను మిమ్మల్ని గెలిపించానుగా... పూర్తిగా కాకపోయినా...!'' అంటూ వంశీ నవ్వేసరికి వాళ్ళూ సరదాగా నవ్వేసారు.

ఆ తరువాత ఒకరికొకరు పరిచయాలు చేసుకున్నారు. వంశీ చెప్పాడు.

''నా పేరు మీకు తెలిసిందేగా, దామోదరం గారు మా నాన్నకి బాగా స్నేహితులు. ఆరేడు నెలల క్రితమే నాన్న చనిపోయారు. అమ్మేమో నేనయినా వెళ్ళాల్సిందేనని పట్టుబట్టటంతో రాక తప్పిందికాదు. ఇక్కడ నాకెవరూ తెలిసినవాళ్ళు లేరు కాబట్టి వెళ్ళనని చెప్పినా, ఆ సాకు పనిచేయలేదు, మా మావయ్య 'తను ఉంటానుగా' అంటూ భరోసాఇచ్చాడు గానీ, ఇక్కడకు వచ్చాక, ఓసారి నాకు మొహం చూపించి, మళ్ళీ కలుస్తానంటూ తన ఫ్రెండ్స్ తో కార్డ్సు ఆటలో మునిగిపోయినట్లున్నాడు.''

వెంటనే ఆ అమ్మాయీ తన గురించి చెప్పింది. ''సరిగ్గా నాదీ మీ పరిస్థితే. నాకూ తెలిసినవాళ్ళెవరూ ఉండరని నేనంటే, దామోదరం అంకుల్ వినలేదు...'నీ క్లోజ్ ఫ్రెండ్స్ ని ఎవరినైనా ఒప్పించి నీకు తోడుగా తీసుకుని రామ్మా...' అనటంతో నాకూ ఇంకేం కారణం కనిపించక వచ్చాను... ఇదిగో ఈ నలుగుర్నీ ఎలాగో ఒప్పించి నాకు తోడుగా తెచ్చుకోగలిగాను. మా అమ్మవాళ్ళకి తప్పని సరిగా వెళ్ళాల్సిన శుభకార్యం ఇంకొకటి ఉండటం వలన నేనే హాజరు కావాల్సి వచ్చింది. ఇంతకీ నా పేరు చెప్పలేదు గదూ... సుమజ...'' అంటూ చిరునవ్వు చిందించింది.